సాక్షి అనంతపురం

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



క్రికెట్ జట్టు ఎంపిక రేపు

జిల్లా సీనియర్ క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపిక కోసం ఆదివారం ఉదయం 9 గంటలకు అనంత క్రీడామైదానంలో పోటీలు నిర్వహించనున్నారు.

గరిష్టం/కనిష్టం

41.8°/21.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సూర్యప్రతాపంతో ఎండలు మండిపోతున్నాయి.



రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సెహరి
6.35	4.47

న్యూస్‌రీల్

త్యాగాలు వృథా కావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బంది త్యాగాలు వృథా కావని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఆవరణలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలను ముఖ్య అతిథి జిల్లా జడ్జి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ విపత్తులు, ప్రమాదాలు, అనుకోని సంఘటనల్లో ప్రజలను, ఆస్తులను రక్షించేందుకు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న అగ్నిమాపక సిబ్బంది నిజమైన హీరోలన్నారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు విపత్తు, ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలో అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. చివరగా 16 మంది అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగులను జిల్లా జడ్జి సన్మానించారు.

గురుకులాల్లో ఐదో తరగతికి రేపు ప్రవేశ పరీక్ష

రాప్తాడురూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి ఈనెల 16 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ పీఎంకే.సంగీత కుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు ఎగ్జామ్ పాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని, మొత్తం 2,203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వెల్లడించారు. అన్ని కేంద్రాల్లోనూ ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏవైనా సందేహాలుంటే 90008 61117 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

17 నుంచి అండర్-14 క్రికెట్ క్యాంపు



అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా మైదానం వేదికగా ఈ నెల 17 నుంచి అండర్-14 జాతీయ క్రికెట్ కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 11 వరకు క్యాంపు కొనసాగుతుంది. 25 మంది క్రీడాకారులు ఈ క్యాంపులో ప్రాతినిధ్యం వహించనున్నారు. క్యాంపు హెడ్ కోచ్‌గా రాకేష్ ధృవ్, సూరజ్‌యాదవ్ బౌలింగ్ కోచ్, బ్యాటింగ్ కోచ్‌గా వినిత్ ఇండుల్కర్, ఫీల్డింగ్ కోచ్‌గా సెబాస్టియన్ ఆంటోని, ఇతర కోచ్‌లను నియమించారు. వారి నేతృత్వంలో కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నారు.

అత్యాశపై ఉక్కుపాదం



పేదలకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలందిస్తోంది. ప్రభుత్వాస్పత్రులే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ పొందిన రోగికి డిశ్చార్జి అయ్యే వరకు వైద్యసేవలు ఉచితంగా అందించాల్సిందే. అయితే కొన్ని ఆస్పత్రులు రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నాయి. 'ఫీడ్‌బ్యాక్' ఆధారంగా ఆయా ఆస్పత్రులు తగిన మూల్యం చెల్లించుకుంటున్నాయి.

- ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా ఉచితం
- రోగుల నుంచి వసూలు చేస్తే తప్పదు మూల్యం
- 'ఆరోగ్యశ్రీ' జాబితా నుంచి క్రాంతి హాస్పిటల్ సస్పెండ్
- రూ.25 లక్షల దాకా జరిమానా విధించిన అధికారులు
- ఆర్డీటీ, కళ్యాణదుర్గం సీహెచ్‌సీ ఆస్పత్రులకు నోటీసుల జారీ


సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆరోగ్యశ్రీ పథకం అమలులో కొన్ని ఆస్పత్రులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఓ వైపు నిర్ణయించిన ప్యాకేజీ మేరకు ప్రభుత్వం నేరుగా ఆస్పత్రులకు బిల్లులు చెల్లిస్తున్నా అదనపు డబ్బుల కోసం కక్కుర్తిపడుతున్నాయి. దీంతో ఆయా ఆస్పత్రులపై అధికార యంత్రాంగం కొరడా ఝళిపిస్తోంది. ఎక్కడ చిన్న ఫిర్యాదు వచ్చినా అలాంటి ఆస్పత్రులపై భారీగా జరిమానాలు విధిస్తున్నాయి. పేదవాడికి పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలవుతోంది. కానీ కొన్ని చోట్ల ఇలా డబ్బులు వసూలు చేస్తుండటాన్ని సర్కారు సీరియస్‌గా తీసుకుంది.

క్రాంతి ఆస్పత్రిపై చర్యలు

ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల జాబితా నుంచి అనంతపురంలోని క్రాంతి హాస్పిటల్‌ను సస్పెండ్ చేశారు. పలువురు రోగుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేసినందుకు ఈ చర్యలు తీసుకున్నారు. అంతేకాదు రూ.25 లక్షల జరిమానా విధించారు. దీంతో పాటు ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఆస్పత్రిలో కొంతమంది సిబ్బంది రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆర్డీటీ ఆస్పత్రికి కూడా నోటీసులు జారీచేశారు. మరికొన్ని ఆస్పత్రులపై కూడా ఫిర్యాదులొచ్చినట్టు సమాచారం.

ప్రభుత్వాస్పత్రుల్లోనూ వసూళ్లే..

కొన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనూ వసూళ్లు చేస్తున్నట్టు ఫిర్యాదులొచ్చాయి. ఇందులో భాగంగా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో కొంతమంది వైద్యులు, నర్సులు రోగుల నుంచి డబ్బులడిగారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేయగా.. నిజమని తేలింది. దీంతో కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి నోటీసులు జారీచేశారు. గతంలో సర్వజనాసుపత్రిలోనూ కొంతమంది సిబ్బంది రోగులనుంచి అదనంగా డబ్బు వసూలు చేయగా.. వారికి నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్న తారతమ్యం లేకుండా రోగుల నుంచి ఎవరు డబ్బు వసూలు చేసినా తీవ్ర చర్యలు తీసుకోనున్నారు. రోగి డిశ్చార్జి అయ్యాక ట్రీట్‌మెంట్‌పై ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ ఇస్తారు. ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కూడా ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటారు.



అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఇలా..

ప్రైవేటు ఆస్పత్రులు	57
డెంటల్ ఆస్పత్రులు	24
వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు	22
ప్రభుత్వ సర్వజనాస్పత్రి	1
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	66

14 ఆస్పత్రులకు నోటీసులు



ఇటీవలి కాలంలో జిల్లాలో రకరకాల ఫిర్యాదుల కారణంగా 14 ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చాం. ఇందులో తొమ్మిది ఆస్పత్రులకు పెనాల్టీ వేశాం. ఇప్పటివరకూ రూ.9 లక్షలు పెనాల్టీ వసూలు చేశాం. రోగుల నుంచి ఒక్క పైసా అడిగినా ఆయా ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ కోర్డినేటర్

కౌన్సెలింగ్‌కే ప్రాధాన్యత ఇవ్వండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: దిశ పోలీస్ స్టేషన్‌ను డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల నమోదు, కౌన్సెలింగ్ ఇచ్చే తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులుతో పాటు సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాధలో స్టేషన్ మెట్లు ఎక్కేవారిని ఆత్మీయుల్లా మాట్లాడి ఆత్మస్థైర్యం నింపాలన్నారు. మనస్పర్థలతో విడిపోదామని వచ్చే భార్యాభర్తలను రాజీ కుదుర్చి కలిసి జీవించేలా కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధితులతో సున్నితంగా మాట్లాడాలన్నారు. అంకితభావంతో సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. ఈవ్ టీజింగ్, అఘాయిత్యాలు జరిగే ప్రాంతాలలో నిఘా పెంచాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌పై కేసు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు టీడీపీ నేత జేసీ అస్మిత్‌రెడ్డి, వారి అనుచరులపై తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నియోజకవర్గంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి తన కుమారుడితో పాటు అనుచరులతో కలిసి అనుమతి లేకుండా బాణసంచా కాల్చారు. పోలీసులు హెచ్చరిస్తున్నా వినకుండా బాణసంచా కాల్చినందుకు ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ కింద ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డితో పాటు అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు.

ఇద్దరు హెడ్‌నర్సులకు పదోన్నతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం సర్వజనాస్పత్రిలో ఇద్దరు హెడ్‌నర్సులు నిర్మలాబాయి, ఎస్తేర్‌కు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. వీరిని నంద్యాల ప్రభుత్వ సర్వజనాస్పత్రికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారిని సిబ్బంది, నర్సులు ప్రత్యేకంగా అభినందించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు

- ఆ దిశగా సీఎం జగన్ చర్యలు
- మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్

అనంతపురం రూరల్ : అన్ని వర్గాల ప్రజలూ స్వేచ్ఛగా జీవించాలన్న సామాజిక సమానత్వ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రచించారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని కొనియాడారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లాపరిషత్ ఎదురుగా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. మంత్రులతో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రులు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల అంటరానితనం రూపుమాపడంతో పాటు సమాజంలో అని వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అణగారిన వర్గాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తేనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరి సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నార్పలలో సీఎం సభా వేదిక ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఆలూరు సాంబశివారెడ్డి, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు ప్రారంభోత్సవం తర్వాత రెండోసారి అంటే ఈ నెల 17న శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో జగనన్న వసతి దీవెన నగదు జమ చేసే కార్యక్రమం ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిపారు. అధికారులందరూ సమన్వయం చేసుకొని పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగినంత తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే 104, 108 వాహనాలను, స్పెషలిస్టు డాక్టర్లతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వారికి బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎం, డీటీసీలకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీకి సూచించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సభకు హాజరయ్యే విద్యార్థులు, లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ హెలిప్యాడ్ నుంచి సభా స్థలి వరకూ చేపట్టాల్సిన పనులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. బహిరంగసభకు జేఎన్‌టీయూ, ఎస్కేయూ వాటి అనుబంధ కళాశాలల విద్యార్థులు, లబ్ధిదారులకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా గంట ముందే చేరుకునేలా ఇన్‌చార్జ్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పక్కాగా చేయాలి


నార్పల: సీఎం పర్యటనకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. జగనన్న వసతి దీవెన పథకం కింద కంప్యూటర్ బటన్ నొక్కి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం జగన్ ఈ నెల 17న నార్పలకు రానున్నారు. ఈ సందర్భంగా సీఎం సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమితో కలిసి ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీలు రంగయ్య, గోరంట్ల మాధవ్, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి బాబు, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, సర్పంచు మన్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

సీఎం సభకు ప్రత్యేక వైద్య బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రత్యేక వైద్య బృందాన్ని ఎంపిక చేసినట్లు అనంతపురం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ వెల్లడించారు. వైద్య బృందంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ రవిప్రకాష్, కార్డియాలజీ డాక్టర్ వెంకటరమణ, జనరల్ సర్జరీ విభాగం నుంచి డాక్టర్ కరుణకుమార్ ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పాటించాల్సిందే

- నాణ్యతా ప్రమాణాలు పాటించని డిగ్రీ కళాశాలలపై చర్యలు
- గత ఏడాది 8 కళాశాలల గుర్తింపు రద్దు చేసిన ఎస్కేయూ
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో కాలేజీల నాణ్యతా ప్రమాణాల మదింపు
- 28 డిగ్రీ కళాశాలలకు షోకాజ్



ఎస్కేయూ పాలక భవనం

అనంతపురం: నాణ్యతా ప్రమాణాలు తీసికట్టుగా ఉన్న డిగ్రీ కళాశాలలపై ఎస్కేయూ యాజమాన్యం చర్యలకు ఉపక్రమించింది. వర్సిటీ పరిధిలో డిగ్రీ, బీఈడీ, పీజీ కళాశాలలు మొత్తం 90 ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలు మదింపు జరుగుతోంది. ఆన్‌లైన్ విధానంతో పాటు నేరుగా ఆయా కళాశాలలను నిజనిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ) పరిశీలించి.. బోధనా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధ్యయనం చేసింది. ఏ కళాశాలకు ఎన్ని సీట్లు కేటాయించాలనే అంశంపై నివేదిక రూపొందించి ఎస్కేయూ ఉన్నతాధికారులకు అందజేసింది. ఇందులో 28 డిగ్రీ కళాశాలల్లో సౌకర్యాలు లేవని నివేదిక ఇచ్చారు.

మూడు కేటగిరీలుగా విభజన

మౌలిక వసతులు, నాణ్యతా ప్రమాణాలను బట్టి కళాశాలలను మూడు కేటగిరీలుగా విభజించారు. అత్యున్నత ప్రమాణాలు ఉంటే తొలి కేటగిరీగా, ఒక మోస్తరులో ఉంటే రెండు, అధ్వానంగా ఉంటే మూడో కేటగిరీగా ఉన్నత విద్యా మండలి నిర్దేశించింది. జిల్లాలో తొలి కేటగిరీలో ఒక్క కళాశాల కూడా లేదని నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. రెండో కేటగిరీలోకి 82 డిగ్రీ కళాశాలలు, మూడో కేటగిరిలో 8 డిగ్రీ కళాశాలలను చేర్చింది. ఈ 8 డిగ్రీ కళాశాలల్లో గత విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లను నిరాకరించారు. వీటికి గుర్తింపు రద్దు చేశారు.

- తాజాగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలలకు గుర్తింపు ఇవ్వడానికి ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందుకోసం నిజనిర్ధారణ కమిటీ ఆయా కళాశాలల స్థితిగతులను అంచనావేసింది. రెండో కేటగిరీలోని 82 డిగ్రీ కళాశాలల్లో ఏకంగా 28 డిగ్రీ కళాశాలలకు గుర్తింపు ఇవ్వకూడదని తేల్చింది. వీటికి త్వరలోనే నోటీసులు జారీ చేసి నిర్దేశించిన ప్రమాణాలు పెంపొందించుకోవడానికి నిర్ణీత గడువు ఇవ్వనుంది. ఆ గడువులోపు స్పందించకపోతే కళాశాల గుర్తింపు రద్దు చేయనున్నారు.
- ఇది వరకు మూడు నెలల్లోపు నిర్దేశిత ప్రమాణాలు పెంపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తాజాగా స్వల్ప వ్యవధి గడువు మాత్రమే ఇవ్వనున్నారు. 30 శాతం లోపు ఫ్యాకల్టీ కొరత ఉండకూడదు. 30 శాతంలోపు భవనాలు ఉండరాదు. రిజిస్ట్రేషన్ కాని భూమి ఉండరాదు. లీజు డాక్యుమెంట్లు, సొసైటీ పేరుతో టైటిల్ డీడ్ ఉంటే చెల్లదు. కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో కళాశాల ఉండకూడదు. గడిచిన మూడేళ్లలో 25 శాతంలోపు అడ్మిషన్లు ఉండకూడదు. ఇలాంటి లోపాలు ఉంటే కళాశాలకు గుర్తింపు ఇవ్వరు.

పాలకమండలి నిర్ణయం మేరకే..



నాణ్యమైన విద్య అందితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందనే ఉద్దేశంతో సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. అన్ని కళాశాలల్లో నిజనిర్ధారణ కమిటీలు పరిశీలించి నివేదిక అందజేశాయి. ఈ వివరాలు పాలకమండలి ఆమోదం మేరకు ఎన్ని డిగ్రీ కళాశాలలకు అనుమతి వస్తుందనే అంశంపై స్పష్టత వస్తుంది.

–ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

లెవల్ 1 కోచ్ కోర్సుకు ముగ్గురు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ క్రికెట్ అకాడమీ లెవల్ -1 కోచ్ కోర్సుకు జిల్లా నుంచి ముగ్గురు కోచ్‌లు నజీర్ అహమ్మద్, శర్మాస్ వలి, నరేష్ కుమార్ ఎంపికయ్యారు.

క్లుప్తంగా

శ్మశానంలో నిప్పు .. తప్పిన ముప్పు



మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

ఆత్మకూరు: మిట్ట మధ్యాహ్నం .. అందరూ పనులకు వెళ్లి ఇళ్లకు తిరిగి వచ్చి ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా శ్మశానంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడిన సంఘటన శుక్రవారం ఆత్మకూరు శ్మశాన వాటికలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... శుక్రవారం ఆత్మకూరులో ఓ వ్యక్తి మరణించగా వాళ్ల సాంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని కట్టెలతో కాల్చారు. ఈ క్రమంలో ఆ మంటలు శ్మశానమంతటా వ్యాపించాయి. శ్మశానం చుట్టూ పదుల సంఖ్యలో పశువులు, వాములు ఉన్నాయి. దీంతో ఆ మంటలు మేత పశువులు ఉన్న దొడ్లోకి వ్యాపిస్తుండటంతో స్థానికులు , యువకులు అంతా ఒక్కటయ్యారు. బిందెలతో , వేప కొమ్మలతో మంటలను అదుపు చేశారు. అయినా మంటలు అదుపుకాకపోవడంతో ట్రాక్టర్ల ట్యాంకర్లతో నీళ్లతో మంటను ఆర్పారు. దాదాపు రెండు గంటల పాటు మంటలను అదుపు చేయడానికి సమయం పట్టింది. మంటలు ఆర్పే క్రమంలో కార్తీక్ అనే యువకుడి గాయాలై స్పృహ తప్పిపడిపోయాడు. దీంతో పోలీసులు తమ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం అగ్నిమాపక వాహనం రావడంతో మంటలను పూర్తిగా అదుపు చేసింది.

24న కర్నూలులో నిరసన దీక్ష



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: రాయలసీమ హక్కుల సాధనకై కర్నూలు పట్టణంలో ఈనెల 24న జరిగే ఒకరోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని ప్రముఖ రచయిత బండి నారాయణ స్వామి పిలుపునిచ్చారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో 'రాయలసీమ కర్తవ్య దీక్ష' కరపత్రాలను శుక్రవారం స్థానిక అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్వీఎస్ సీమకృష్ణ మాట్లాడుతూ రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా కోసం రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని అన్ని పార్టీల నాయకులను పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ నాయకులు సందీప్, రవీంద్ర, నాగభూషణం, బజారి గోపాల్, రమేష్ స్వామి పాల్గొన్నారు.

వన్యప్రాణులకు అండ

- దాహార్తి తీర్చేలా అటవీశాఖ ప్రత్యేక చర్యలు
- విస్తృతంగా నీటి తొట్టెలు, చెక్‌డ్యామ్‌లు, సాసర్ రింగ్స్ ఏర్పాటు



అటవీశాఖ అధికారులు తొట్టెల్లోకి నీటిని నింపుతున్న ఈ ప్రాంతం శెట్టూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో ఉంది. వెడల్పుగా నిర్మించిన ఈ తొట్టెల్లోకి వారంలో రెండు సార్లు నీటిని నింపుతుండటంతో వన్యప్రాణులకు దాహం కష్టాలు తీరుతున్నాయి. అటవీ ప్రాంతం మొత్తం ఇలాంటి తొట్టెలు నెలకొల్పడంతో ఎండల నుంచి వన్యప్రాణులు కొంత వరకు ఉపశమనం పొందుతున్నాయి.



ఇక్కడ నీటిని నింపుతున్న ప్రాంతం మానిరేవు అటవీ ప్రాంతం. ఈ అడవిలో చిరుత పులులు, ఎలుగుబంట్లు, నక్కలు, జింకలు, కుందేళ్ల సంచారం ఎక్కువగానే ఉంటుంది. నిర్మించిన తొట్టెల్లో తరచూ నీటిని నింపడంతో వన్యప్రాణులకు దాహం కష్టాలు తీరుతున్నాయి. దీంతో రోడ్లపై సంచారం కాస్త తగ్గినట్లు కనిపిస్తోంది.

రాయదుర్గం: అడవికి అందాలు వన్యప్రాణులే.. వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉంది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం దొరక్క వన్య ప్రాణులు జనారణ్యంలోకి రావడం, మృత్యువాత పడటం, అడవుల్లో అగ్ని మంటల్లో చిక్కడం లాంటి కారణాలతో అంతరించిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అటవీశాఖ ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. వన్యప్రాణుల దాహం తీర్చడంతో పాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

గొంతు తడిపేదిలా..

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతు జాలానికి రక్షణ కల్పిస్తున్నారు. అలాగే వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్ రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల గొంతు తడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీశాఖ చేస్తున్న పనులు సత్ఫలితాలనిస్తున్నాయి. అనంతపురం జిల్లాలోని మూడు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో 74,400 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో పులల సంచారం కూడా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

100 తొట్టెల ఏర్పాటు

జిల్లాలోని అన్ని ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని బీట్లలో సుమారు 100 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరందిస్తున్నారు. మరిన్ని సాసర్ పిట్స్, చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

అడవుల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన అవసరం. వేసవి వచ్చిందంటే కార్చిచ్చు బారిన పడి పచ్చ సంపద కాస్త బుగ్గిపాలవుతోంది. సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటలు పాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు.

అడవుల విస్తరణకు కృషి



అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత. అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు జాతులకు చెందిన మొక్కలను పెంపొందించేలా కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అడవుల్లో సంచరించకూడదు. జంతువులను వేటాడి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– సందీప్‌కృపాకర్, డీఎఫ్‌ఓ

అడవుల్లో వన్య ప్రాణుల సందడి



జిల్లాలోని ఫారెస్ట్ ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, జింకలు, నేమళ్లు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చ తోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, చింత, వేర, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్ల మద్ది, సిందుగ, లోలుగ వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శ్రీరాములు

సోమందేపల్లి: మండలంలోని జులకుంట గ్రామానికి చెందిన శ్రీరాములు (28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంజినప్ప కుమారుడు శ్రీరాములు గత కొంతకాలంగా ఉద్యోగంతో పాటు వివాహం చేసుకునేందుకు ప్రయత్నం చేశారు. వివాహంతో పాటు ఉద్యోగం కూడా దక్కకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని పై కప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రేమ విఫలం కావడంతోనే శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

నీట మునిగి బాలుడి మృతి



మృతుడు సురేంద్ర

గుంతకల్లు రూరల్: చెరువులో నీట మునిగి సురేంద్ర (8) అనే బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం నాగసముద్రం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. నాగసముద్రం గ్రామానికి చెందిన దాసరి శివ అనే వ్యక్తి యాడికి మండలం, ఓబుళాపురం గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 6న నాగసముద్రం గ్రామంలో జరిగిన కదిరప్ప స్వామి రథోత్సవానికి శివ భార్య చెల్లెలు అయిన జయలక్ష్మి, ఆమె భర్త సుంకన్న తమ కుమారుడు సురేంద్రతో కలిసి వచ్చారు. రథోత్సవం అనంతరం తిరిగి వెళ్లిన జయలక్ష్మి, సుంకన్నలు తమ కుమారుడు సురేంద్రను మాత్రం నాగసముద్రంలోనే వదిలి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలిసి గ్రామంలోని చెరువు వద్దకు ఈతకు వెళ్లిన సురేంద్ర ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. తోటి స్నేహితులు కూడా విషయాన్ని గమనించలేకపోయారు. అదే సమయంలో ఎద్దులకు నీళ్లు తాపేందుకు వచ్చిన ఒక రైతు నీటిలో దిగగానే నీట మునిగిన సురేంద్ర అతడి కాళ్లకు తగలడంతో ఆ రైతు వెంటనే నీటిలో మునిగిపోయిన సురేంద్రను బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తాడిపత్రి అర్బన్: ఇంటిపైనున్న కేబుల్ వైర్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల వివరాల మేరకు ... భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన అజయ్‌కుమార్‌గౌడ్ (25) శుక్రవారం సాయంత్రం తన ఇంట్లో టీవీ పనిచేయకపోవడంతో కేబుల్ మరమ్మతు కోసం తన ఇంటిపైకి వెళ్లాడు. కేబుల్ వైరు మరమ్మతు చేస్తుండగా కేబుల్ వైరు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయారు. మృతునికి రెండేళ్ల క్రితమే అపర్ణ అనే మహిళతో వివాహమైంది. వీరికి ఆరు మాసాల కుమార్తె ఉంది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు జగన్ కృషి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురం క్రైం: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, తదితర అట్టడుగు వర్గాల వారితో పాటు ఆర్థికంగా వెనుకబడ్డ అన్ని కులాల వారికి సమాన అవకాశాలు రావాలన్న ముందుచూపుతోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారు. ఆ మహనీయుని ఆలోచనలను సీఎం వైఎస్ జగన్ అమలు పరుస్తున్నారు' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ అంబేడ్కర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో సగ భాగం కల్పించారన్నారు. మంత్రి వర్గంలో, కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటగా ఏపీలో సీఎం వైఎస్ జగన్ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశించిన విధంగా విద్య, వైద్యాన్ని అన్ని వర్గాలకు దగ్గరకు చేర్చేలా సీఎం విప్లవాత్మక చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, వైఎస్సార్‌సీపీ అనుబంధ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, రాజారాం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డీసీసీబీ చైర్మన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ మేయర్ రాగే పరుశురాం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ గ్రిల్‌లో వృద్ధురాలి కాలు

- అవస్థలుపడి తీసిన స్థానికులు



ఫుట్ గ్రిల్‌లో కాలు ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలు ఇందిరమ్మ

పుట్లూరు: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు మారింది ఓ వృద్ధురాలి పరిస్థితి. మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ అనే వృద్ధురాలు బీపీ నివారణ మందుల కోసం శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. వైద్య పరీక్షలు చేయించుకుని బయటకు వస్తున్న సమయంలో గేటు వద్ద ఉండే ఫుట్ గ్రిల్‌లో ఆమె కాలు ఇరుక్కుపోయింది. వృద్ధురాలు ఇందిరమ్మ పరిస్థితిని గమనించిన స్థానిక మహిళలు కాలును బయటకు తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కొబ్బెర నూనెను కాలుకు రాయగా కాలు బయటకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోగులు ఇబ్బంది పడుతున్నా అధికారులు ఫుట్‌గ్రిల్‌కు ప్రత్యామ్నాయం ఆలోచించకపోవడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

అనంతపురం సిటీ: అనంతపురం పీటీసీ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి (55) శుక్రవారం తెల్లవారుజామున రైలు కింద పడి చనిపోయినట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడు ఎవరైంది తెలియదని వివరించారు. మృతుడు బూడిద రంగు గీతల షర్ట్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించామన్నారు. సమాచారం తెలిసిన వారు తమకు తెలపాలని ఎస్‌ఐ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి-అనంతపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల వివరాల మేరకు .. మృతుడి వయస్సు సుమారు (35) సంవత్సరాలు ఉంటుందని, మృతుడు బ్లూకలర్ టీషర్ట్, పాచీ రంగు ఉన్న ప్యాంటు ధరించినట్లు చెప్పారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో రైలు దిగి నడుచుకుంటూ వచ్చి బ్రిడ్జి వద్ద మృతి చెందినట్లు అక్కడున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు - వరికోత మిషన్ ఢీ

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సు, వరికోత మిషన్ ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో అనంతపురానికి వెళ్తోంది. అయితే కల్లూరు వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో కల్లూరు వైపుకు వెళ్లడానికి వరికోత మిషన్... బస్సుకు ఎదురుగా రావడంతో రెండు ఢీకొన్నారు. ఆర్టీసీ బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదు. వరికోత మిషన్ డ్రైవర్ సెలమ్ అర్సన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రారంభం



గురుకుల పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- జగనన్న సహకారం మరువలేమన్న ఎమ్మెల్యే పద్మావతి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతోనే పూర్తి చేయగలిగామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొర్రపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రూ.13 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకుల బాలికల పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. మేమే గొప్ప. అంటూ.... కల్లబొల్లి ప్రచారాలు చేసుకునే టీడీపీ ప్రభుత్వం పాఠశాల నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చు పెట్టి చేతులు దులుపుకుందన్నారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలతో 450 మంది బాలికలు వసతి గృహం లేక నరకయాతన అనుభవించారని తెలిపారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో పంగల్ రోడ్డులో అద్దె భవనంలో ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థులను కొర్రపాడు ఎస్ఎస్ఏ ట్రెనింగ్ సెంటర్‌లోకి మార్పించామన్నారు. 10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల భవన నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సీఎం జగనన్నతో చర్చించి పెండింగ్‌లో ఉన్న 90 శాతం బిల్లులు మంజూరు చేయించామని తెలిపారు. విద్యా సంక్షేమానికి సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ భాస్కర్ జ్ఞాపికను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ చాలమూరు హరిత, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీలు సునీత, లోకేశ్వరి, సర్పంచ్ నాగలక్ష్మి, పార్వతి, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి 'పది' మూల్యాంకనం

రాప్తాడు రూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) ఈ నెల 19 నుంచి 26 వరకు జరుగుతుందని డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో జరిగే మూల్యాంకన ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన జవాబు పత్రాల కోడింగ్ ప్రారంభమైందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ మూల్యాంకనం విధులకు నియమించిన ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరికైనా తీవ్రమైన అనారోగ్య సమస్య ఉన్నవారు తగిన ఆధారాలతో డీఈఓను కలిస్తే మినహాంపు ఇస్తామన్నారు.

- అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఒక రోజులో 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాలి.
- సంబంధిత అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసిన అన్ని సమాధాన పత్రాల మార్కులను స్పెషల్ అసిస్టెంట్లు లెక్కించాలి. ప్రత్యేక సహాయకులు వీటిని కూడా ధ్రువీకరించాలి.
- చీఫ్ ఎగ్జామినర్ ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేసిన కనీసం 20 ఆన్సర్ స్క్రిప్ట్‌లను వెరిఫై చేయాలి. (అంటే మొత్తం 60 ఆన్సర్ స్క్రిప్ట్‌లు వెరిఫై చేయాల్సి ఉంటుంది).
- అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ నుంచి కనీసం 2 స్క్రిప్ట్‌లను వెరిఫై చేయాలి.
- డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ రోజుకు కనీసం 45 వాల్యుయేట్ స్క్రిప్ట్‌లను వెరిఫై చేయాలి.
- క్యాంపు అధికారి రోజుకు కనీసం 20 జవాబు పత్రాలను ధ్రువీకరించాలి.
- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియలో అభ్యర్థులకు సమాధాన పత్రాల ఫొటోస్టాట్ కాపీలు అందిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా చూసుకోవాలని డీఈఓ సూచించారు.

క్లుప్తంగా

ఆర్‌ఓ ప్లాంటు వితరణ



బాలికల వసతి గృహానికి ఆర్‌ఓ ప్లాంటు అందించిన యూనియన్ బ్యాంకు అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం తరఫున స్థానిక అరవిందనగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహానికి శుక్రవారం రూ.50 వేలు విలువ చేసే నీటిశుద్ధి యంత్రం అందించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ జితేంద్రకుమార్ మిశ్రా, డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థనాయక్, అధికారులు గోపన్న, రామాంజనేయులు, మహంతి, థామస్ పాల్గొన్నారు.

నియమాలతో హజ్ యాత్ర పూర్తి చేయాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: హజ్ యాత్రను అత్యంత నియమాలతో పూర్తి చేయాలని ప్రభుత్వ ఖ్వాజీ మౌలానా హారూన్ రషీద్ తెలిపారు. స్థానిక చాందినీ మసీదులో 2023 సంవత్సరానికి జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి హజ్ శిక్షణ తరగతులను చాందినీ మసీదులో నిర్వహించారు. యాత్రకు సంబంధించి పాటించాల్సిన నియమాలను ఆయన వివరించారు. మక్కా, మదీనాలను సందర్శించునప్పుడు ఏవిధంగా తవాఫ్ చేయాలి, వాటిని సందర్శించినప్పుడే ఎలాంటి దువాలు ఆచరించాలి.. కాబాను చూసినప్పుడు ఎలాంటి దువా చేయాలనే దానిపై వివరించారు. కార్యక్రమంలో చాందిని మసీదు సభ్యులు మునీర్‌బాషా, మొహమ్మద్ రఫి, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్భాషలాడిన వారిని అరెస్టు చేయాలి

అనంతపురం అర్బన్: నగరపాలక సంస్థ అధికారులపై దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగ, కార్మిక జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేశారు. జేఏసీ నాయకులు నాగేంద్రకుమార్, రాజేశ్, శ్రీధర్, వెంకటనారాయణ, తదితరులు మాట్లాడారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని సాయినగర్‌లో ఉన్న రెహమానియా మసీదులో డాక్టర్ అక్బర్ సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందులో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ సాబ్, మాజీ మునిసిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, డాక్టర్ అల్తాఫ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తహోమం

అనంతపురం కల్చరల్: లోకకల్యాణార్థం మూడు రోజుల పాటు సాగే నవకోటి దత్తహోమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీశృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలోని పాతూరు దత్తాత్రేయస్వామి దేవస్థానంలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన రుత్వికులు వేర్వేరు హోమగుండాల వద్ద శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ఈనెల 16 వరకు నవకోటి దత్తహోమాలు 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్విరామంగా జరుగుతాయి.

బీజేపీ నాయకులను అరెస్టు చేయాలి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులు ఫయాజ్, లలిత్‌కుమార్, పలువురు వ్యాపారులను అరెస్టు చేయాలని ఎన్‌జీఓ సంఘం, వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అధికారులపై దుర్భాషలాడిన ఘటనను వారు ఖండిస్తూ శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డికి వారు మద్దతు తెలిపారు. అనంతరం వారు ర్యాలీగా నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి జెడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వామపక్ష నాయులు నాగేంద్ర మాట్లాడారు. ఎన్‌జీఓ సంఘం నాయకులు శ్రీధర్‌బాబు, మనోహర్ రెడ్డి, జమీలాబేగం, వామపక్ష నాయకులు నాగేంద్ర, రాజేష్‌గౌడ్, ఆర్‌వీ నాయుడు, నగరపాలక సంస్థ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రమణ మహర్షి ఆరాధన

అనంతపురం కల్చరల్: భగవాన్ రమణ మహర్షి జీవితం ఆదర్శప్రాయమని డాక్టర్ పాణ్యం వసుంధర అన్నారు. శుక్రవారం స్థానిక మూడోరోడ్డులోని గొంగడి రామప్ప ఫంక్షన్ హాలులో రమణ మహర్షి 73వ ఆరాధన మహోత్సవం జరిగింది. రమణమహర్షి సేవా సమితి ఆధ్వర్యంలో చలపతి రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగుతుందని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా అనంతపురం రూరల్ పంచాయతీలో సర్పంచ్ ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాంనాయుడు, ఎంపీటీసీ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎం.లిఖిత, సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖా రాణి, నాబార్డు డీడీఎం అనురాధ హాజరయ్యారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

అనంతపురం: అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూఏ పాలకభవనంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవరెడ్డి, సదస్సు కోఆర్డినేటర్ బి.అజిత తదితరులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, ఓటీపీఆర్‌ఐలో డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్ పాల్గొన్నారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి. ప్రణతి, రెక్టార్ ప్రొఫెసర్ ఏమల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సి పాల్ బాలసుబ్రమణ్యం, కన్వీనర్ డాక్టర్ సీహెచ్ కృష్ణుడు, పీఆర్వో డాక్టర్ కే.రాంగోపాల్ పాల్గొన్నారు.
- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో వర్సిటీ డీన్ ఇన్‌చార్జ్ రామ్‌రెడ్డి, ఎస్కేయూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎస్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.
- అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బార్‌అసోసియేషన్ అనంతపురం అధ్యక్షుడు కే విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, సంస్థ కార్యదర్శి పి.రమ, సిబ్బంది శివశంకర ప్రసాద్, ఇంతియాజ్ అహమ్మద్, జీఎం బాషా, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: నగరంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎన్. రఘురామి రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి. ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేసు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- ఆర్ట్స్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, ఏబీవీపీ నగర కార్యదర్శి శివ తేజ మాట్లాడారు.
- ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్ర, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వలగొండ రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు కోటి మల్లేష్, జిల్లా అధ్యక్షుడు పుట్లూరు సుధాకర్, ప్రధాన కార్యదర్శి వంకరాజుకాల్వ గోవిందరాజులు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.
- స్థానిక ఆదిమూర్తినగర్‌లోని లిటిల్‌ఫ్లవర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.
- ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఓబుళపతి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు, జిల్లా నాయకులు వీర ఓబులు, ఆదినారాయణ, నాగేంద్ర, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మారాం, ఆర్ఎంఓలు వైవీ రావు, సునీత వేడుకలు జరిపారు.

రాప్తాడు: మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను జరిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి పసునూరి పెద్దన్న పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ: బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, జిల్లా కార్యదర్శి డి. గోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కే రామమూర్తి, శ్రీరాములు, రామచంద్ర పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్ : జెడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వివిధ కుల, ప్రజా సంఘాలు నాయకులు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సాకే హరి, బీసీఆర్ దాస్ మాల మహానాడు నాయకులు ఓబిలేసు, గడ్డం ముత్యాలప్ప, చిన్న ఆంజనేయులు, నారాయణ స్వామి, ఎల్లన్న, పోలా వీరాంజనేయులు, మల్లికార్జున నాయక్, సాకే శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మారాం, ఆర్ఎంఓలు వైవీ రావు, సునీత పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శంకర్, డాక్టర్ వేముల సరోజ, సిబ్బంది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం జిల్లా కోర్టులో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ..



ఎస్కేయూలో ...



సెంట్రల్ యూనివర్సిటీలో...



రాప్తాడు: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, సీఈవో రామ్‌ప్రసాద్



వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో...



జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ జింకా రంగజనార్దన తదితరులు

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం



మాట్లాడుతున్న మేయర్ వసీం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించడమే లక్ష్యంగా అధికారులు దాడులు చేస్తుంటే.. బీజేపీ నా యకులు ఓ వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదని నగర మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినతిపత్రం ఇవ్వడానికి వచ్చి అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

గడువిచ్చినా మార్పు రాలేదు:

ప్లాస్టిక్ నిషేధానికి 8 నెలల క్రితమే సమావేశం ఏర్పాటు చేసి, నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించొద్దని స్పష్టంగా తెలియజేశామని మేయర్ అన్నారు.గతంలోనే పాలకవర్గం, నగరపాలక సంస్థ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల రాజురోడ్డులోని పలు షాపుల్లో నగరపాలక సంస్థ అధికారులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసుల సహాయంతో సీజ్ చేసినట్లు తెలిపారు. నగరంలో 25 నుంచి 30 వరకు ప్లాస్టిక్ విక్రయించే షాపులున్నాయని, ఆ షాపులపై దాడులు యథావిధిగా కొనసాగిస్తామని మేయర్ స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్‌భూషణ్, బాబాఫక్రుద్దీన్, నాయకులు ఖాజా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యమిస్తే దుర్భాషలా?

కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యమిస్తే..బీజేపీ నాయకులు దుర్భాషలాడడం సరికాదని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులు, నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న 25 మంది వ్యాపారులపై ధ్వజమెత్తారు. ఈ నెల 13న నగరపాలక సంస్థలో కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితర అధికారులు బట్టలూడదీసి కొడతామని బీజేపీ నాయకులు ఫయాజ్, లలిత్‌కుమార్ దూషించడం సరికాదన్నారు. మహాలక్ష్మి, మహవీర్ షాపులపై ఇప్పటికే మూడు నుంచి నాలుగు సార్లు అధికారులు దాడుల చేపట్టి హెచ్చరికలు చేసినా మార్పురాలేదన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం



ఎస్కేయూనివర్సిటీ వద్ద మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, రమేష్‌గౌడ్

అనంతపురం క్రైం: జిల్లాకు విచ్చేసిన ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుక్రవారం ఎస్కేయూనివర్సిటీ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, శింగనమల పరిశీలకులు రాజారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మేయర్

అనంతపురం క్రైం: స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మేయర్ వసీం శుక్రవారం కలిశారు. ఆ సమయంలో మంత్రి అదే శాలువాను మేయర్‌కు కప్పి సన్మానించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని నగరపాలక సంస్థ మేయర్ వసీం సన్మానించారు.

నేత్రానందంగా శ్రీవారి ఊంజల సేవ

అనంతపురం కల్చరల్: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊంజల సేవలు నయనానందకరంగా సాగాయి. స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. శ్రీవిష్ణు సహస్రనామ సేవా సత్సంగం వారి ఆధ్వర్యంలో 16వ పర్యాయం కోటి జపం పరిసమాప్తిని పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజలు, పుష్పాలంకార సేవలు ఉదయం నుంచి రాత్రి వరకు జరిగాయి. ప్రముఖ నాట్యాచార్య సంధ్యామూర్తి భక్తి గీతాలాపన, శ్రవణ ప్రియంగా సాగిన వేద మంత్రాల నడుమ శ్రీవారికి ఊంజల, శయనోత్సవ సేవలు జరిగాయి. సత్సంగం నిర్వాహకులు మేడా వేంకటేశ్వర్లు, మణూరు నాగరాజు, ప్రధాన అర్చకులు హరికృష్ణశర్మ, గోవింద భజన మండలి ఆళ్లగడ్డరాము, సాయిట్రస్టు విజయ్‌సాయి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలేదు



రాప్తాడులో 'జగనన్న మా భవిష్యత్తు'పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే జై కొడుతున్నారని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. మండల కేంద్రం రాప్తాడులో ఎనిమిదో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండలవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యాజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సచివాలయ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు జయన్న, ముత్యాలు, గోపి, వలంటీర్లు బీరన్న, హరి పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిరపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జగనన్నతోనే మా భవిష్యత్, జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేద్దాం

ఆత్మకూరు: మేజర్ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిపారు. వలంటీర్లు, వార్డు మెంబర్లతో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, పంచాయతీ సెక్రటరీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసుల నమోదు

అనంతపురం శ్రీకంఠసర్కిల్: వరకట్న వేధింపులు తాళలేక ఇద్దరు మహిళలు దిశ పోలీసులను ఆశ్రయించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు వేధింపులు

కర్నూల్ టౌన్ లక్ష్మినగర్‌కు చెందిన నందినిని 2019లో అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. కాగా దంపతులిద్దరూ బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. నందిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమె భర్త ప్రవీణ్‌తో పాటు బావ దినేష్, అత్త సరస్వతి, ఆడపడుచు మధుర వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారు.బాధితురాలు ఇచ్చినా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఎస్ఐ సునీత్‌కుమార్‌పై కేసు

స్థానిక భైరవనగర్‌కు చెందిన విశ్రాంత ఎస్ఐ సునీత్‌కుమార్‌పై అతని భార్య బి. రమణమ్మ దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 1986లో బి. సునీత్‌కుమార్‌తో రమణమ్మకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు ఇద్దరు స్థిరపడ్డారు. గతంలోని పలు విషయాలను మనసులో భర్త చీటికి మాటికి పెట్టుకుని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. తనకు వచ్చిన రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, ఫించన్ డబ్బులు పైసా కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. సునీత్‌కుమార్‌కు చెందిన బంధువులు ఇంటికి వస్తే వారికి భార్య మర్యాద చేయలేదన్న కారణంతో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన భార్య రమణమ్మ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. అనంతరం కుమారుల సహకారంతో దిశ పోలీసులను ఆశ్రయించింది.

విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



3వ డివిజన్ కార్పొరేటర్ కుమారమ్మతో ఆనందాన్ని పంచుకుంటున్న వృద్ధురాలు

అనంతపురం క్రైం: నగరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది. శుక్రవారం నగరంలోని వివిధ డివిజన్లలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 39వ డివిజన్ పార్వతమ్మ కొట్టాల్లో జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు సీపీఐ నాయకులు అభ్యంతరం చెప్పగా వారి సమక్షంలోనే కాలనీవాసులకు అందుతున్న పథకాలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. 3వ డివిజన్‌లో ఓ వృద్ధురాలు ప్రభుత్వం చేస్తున్న మేలును మరువలేమని డివిజన్ కార్పొరేటర్ కుమారమ్మతో ఆనందాన్ని పంచుకుంది.

సమాజ శ్రేయస్సులో విద్యార్థులే కీలకం



ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: సమాజ శ్రేయస్సులో విద్యార్థులే కీలకమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడులోని స్థానిక సాక్రెడ్ హర్ట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ పీపై ఆంజనేయులు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలు నేర్పించడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ఎంపీపీ, యూత్ మండల కన్వీనర్, ఎస్ఐని పాఠశాల యాజమాన్యం సన్మానించింది. పాఠశాల హెచ్ఎం రజిని, ఫాదర్ రవీంద్ర, ఫాదర్ రాజశేఖర్, కర్మల్ మాతా చర్చ్ ఫాదర్ జోసెఫ్, ఎల్లార్తి పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం డేవిడ్ ఫాదర్, రాజీవ్, సిస్టర్ జెస్సీ జెకబ్, ఫాదర్ లూయిష్ తదితరులు పాల్గొన్నారు.